

# ఫ్రూట్ ఆఫ్ ఫ్రూట్స్

రాచకొండ రంగనాథశర్మ

ఐదుగ్లాసులు ఒకదానికొకటి చిన్నగా తగిలి వింతశబ్దంచేసి 'వెధవ త్రాగుబోతు మూతుల్ని' సుతారంగా తాకాయ్.

త్రాగినవాడెప్పుడూ నిజాల్నే చెబుతాడంటారు—

అలా వాళ్ళదగ్గర్నుంచి కొన్ని నిజాల్ని రాబట్టటమే నా 'మోటో.'

అందుకే నేను అక్కడ ఆరవవ్యక్తిగా మాత్రం ఉన్నాను.

చపలత్వం అనే తెలుగుమాటకు (నాగరిక ప్రపంచంలో) ఖచ్చితమైన యింగ్లీషు పదం 'కంపెనీ' అంటాన్నేను - డోంట్ కేర్-నా అభిప్రాయంతో ఎవళ్ళయినా ఏకీభవించకపోతే-

'కాస్త కక్కుర్తిపడు.'

'కొంచెం ఎంగిలిపడు.'

(లేకపోతే మేం తింటూంటే వెధవన్నర వెధవ కళ్ళేసుకుని చూస్తూ, ఊరుతున్న లాలాజలాన్ని ప్రక్కకు తిరిగి గుటక వేస్తావ్)

యివన్నీ మోటుపదాలు కనుక దాన్ని యింగ్లీషులో 'కంపెనీ' కోసం అంటాం అన్నమాట.

ఇంక ఆ అయిదుగురత్రాష్టుల పేర్లూ యివి—

గళ్ళచొక్కా తొడుక్కుని ఎర్రరుమాలు మెళ్లోకట్టుకుని ద్రాపిమొహంతో ఉన్నాడు చూడండి. వాడు శివలింగం (టొన్సార్: వాడసలు పేరు శివలింగమే కావచ్చు-వాణ్ణి చూపినవాడెవడూ అలా పిలవడు)

యిక వాడిపక్క ... ఉడతమొహం వెధవ సైదులాకులూ - హిప్పీక్రాఫూ వెధవకి యెప్పుడూ ఊటబావిలా చొంగ కారుతూనే ఉంటుంది-వాడి పేరు కాంచన

గంగారావు.

శవలింగానికవతల ప్రక్కవాడి పేరు లలాటశాస్త్రి-పితలాటశాస్త్రి అప్రాప్రియేట్ నేమ్-గుంటకళ్ళూ- నక్కబుద్ధులూనూ.

నాలుగోవాడు సూరిగాడు - మీసంలో అక్కడక్కడ నాలుగు తెల్లవెంట్రుకలు మొలుస్తున్నాయని మీసం ఉంచడసలు తాటికాయమీద కళ్లు ముక్కు నోరు అతి కించినట్టుంటుంది వాడి మొహం.

పోతే ఐదోవాడు ఆ వెధవమొహం మీద 'నవ్వు' అనేది వాణ్ని లక్షరూపా యలనోట్ల మధ్య పాతేసినా కనిపించదు. ఎప్పుడూ ధుమధుమలాడుతున్నట్టు చేఁవట కాయలు పేలినట్టు దురద-దురదగా ఉంటుందా మొహం. వాడిపేరు మార్తాండ మూర్తి!

ఫస్ట్‌రౌండు పూర్తి చేశారు.

మళ్లీ ఐదుగ్లాసులూ నింపేను.

సెకెండ్ .. థర్డ్ ఫోర్త్ రౌండ్,

ఒకదొకడిలో అమోఘమైన పేలా పనాశక్తి విజృంభిస్తూంది.

యీ అవకాశాన్నే వినియోగించుకోవా లనుకున్నాను - అయితే అయిదుగురూ ఒక్కసారే ఒకడు చెప్పింది మరొకడు వినిపించుకోకుండా తను చెప్పేదే ఎదుటి వాడన్నదానికి జవాబుగా సాగిపోతూంది ధోరణి—

రెండు దస్తాలు పేకతీసాను—టేబుల్ మీద పడేశాను.

అందరూ తయారయిపోయేరు.

నలుగురు పేకాడుకోండి ఒకడు మాత్రం నాతో 'చెస్' ఆడాలి అన్నాను.

పేక వదిలేసి 'గురో—నేను' అంటూ ఎవరికివారే తయారయ్యారు.

అలా కాదు; ఒకరొకర్తో ఆడుతాను. యీలోగా నలుగురు కలిసి 'రమ్మీ' ఆడు కోండి.

అదేం లాభంలేదు. నువ్వుకూడా నాలుగు పెగ్గులేసుకో ఆరుగురం కలిసి 'లిటరేచ' రాడుకుందాం.

'నోనో' అన్నాను.

'మీలో ఫస్ట్‌క్లాస్ ఫూల్ ఒకడుంటాడు-వాడెవడో ముందుకు రండి.'

ఒకళ్ళముఖాలొకరుచూసుకున్నారు.

'మేఁవంతా ఫస్టుక్లాస్ ఫూల్సేఁవే' ఏక గ్రీవంగా అన్నారు.

నా ప్లాను చెడిపోతూంది-పైగా ఎంత ఖర్చుపెట్టానని?!

ఒరేయ్ శవలింగం-రాస్కెల్. నువ్వు పేకాడతావా? చెస్సాడుతావా!

నలుగుర్తోటి నారాయణా. ఆక్లేదంటే మరి నేనూ అద్దదే-ఏంట్రా ఏఁవంటారు' అంటూ నవ్వటం మొదలెట్టాడు.

నాకు ఒళ్లు మండిపోతూంది.

మరో యిద్దరి వెధవల్నుంచి కూడా నాకు అలానే జవాబు వచ్చింది.

నాలో పేషన్స్ చచ్చిపోతూంది.

మిగతావాళ్లను కూడా అడిగేశాను.

జవాబు విని చాచిలెంపకాయకొట్టి చెవులు మూయాలనిపించింది.

ఆల్‌రైట్! మీ ఐదుగురూ కలిసి మిగతా రెండు బాటిల్సూకూడా కాళీచేసి ఓమూల పడి ఏడవండి-నేవెళ్ళిపోతున్నా' అంటూ లేచి రెండడుగులు వేసాను— యింతలో....

"పోవుచున్నాదే కవిగాడు పీరుకారి

పోవుచున్నాడే'' సూరిగాడు పాట అందుకుంటే మిగతా స్కౌండ్రల్స్ లయ బద్ధంగా (పడటంలేదసలు) అడుగులేస్తు న్నారు.

నాకు వెర్రికోపం వచ్చేసి బయటకు నడిచి తలుపు గొళ్లెంపెట్టేసి అవతలకుర్చీలో కూర్చున్నాను.

''అలుగుటయే యెరుంగని .''


''అలకమానవే చిలకలకొలికీ.''

ఇంకా యేవేవో కలగాపులగంగా. ముద్దముద్దగా లోపల్నుంచి విన్పిస్తూనే ఉన్నాయ్ వాళ్లగురించిన నిజాల్ని వాళ్ళ చేతే చెప్పిస్తే సబువుగా ఉంటుందనే నా ప్లానంతా డర్టీఫూల్స్ నాశనం చేశారు. వాళ్లగురించి నా భాషలో వ్రాయక తప్పటం లేదు.

ఫస్ట్‌ఫూల్ (1) శవలింగం బియ్యే చది వాడు. రెండోక్లాసు పాసయినట్టు కూడా కనిపించడు. పన్నెండేళ్లకే స్త్రీ వాంఛ పట్టు కుంది వాడికి. అది కురుపులా నలిపి జలో దరంలా పెరిగింది. కసుగాయల్నీ కన్నె పిల్లల్నీ రుచిమూశాడు. నేస్టీ ఫెలో మొగుడు చచ్చిన ముండల్దగ్గర వీడి విజ్ఞానం అంతా ఒలకబోసి ఆరిపోయిన కోరికల మీద యింత పెట్రోలు పోసి భగ్గు మనిపించి గుట్టుచప్పుడు కాకుండా వాడింత సుఖపడి వాళ్ళకింత సుఖాన్ని పంచి యిచ్చే వాడు. ఓ ఏభై వేల ధికారి చెడిపోయిన వెధవ కూతురి మెళ్లో తాళిగట్టేసి వీడో సంస్కర్తయి కూర్చున్నాడు. యీ సంస్కర్తకు కొంచెం సాహిత్యాభిలాష యేడ్చి. యింటర్వ్యూలూ వెధవ్వేషాలూ అంటూ సానికొంపలంట తిరిగి వాళ్ల కథా కమామిసూ తెల్సుకుని వీడి అనుభవాల్ని జోడించి సెక్సు పత్రికలకి కథల్రాస్తూం టాడు. మురిగిపోతున్న వయస్సుకు మెరుగులు దిద్ది మూ(వగార్ని కూడా ముం డల మురాకోరుగా తయారుచేసిన ఘనత కూడా వీడికే దక్కింది. వీడికి యింటా బయటా కూడా రాజకీయంగా ఉన్న ఇన్ఫ్లు యెన్సు నుపయోగించి తిమ్మిని బొమ్మిని బొమ్మిని తిమ్మిని చేస్తూంటాడు. ఒకానొక సందర్భంలో వీడి పెళ్ళాన్ని తార్చేసి కావల్సినపన్లు చేయించుకున్నాడు 'ఏరా యిది' అని అడిగితే 'ఒరేయ్' దాన్ని నేను పెళ్ళాడేసరికే నాకు తెల్సున్నంత వరకూ అది సెకండ్‌హేండ్ సరుకే దాన్ని అంగీకరించిన నా సంస్కారం మరెన్ని 'హేండులు' మారినా ఒప్పుకుంటుంది' యిదీవీడి జవాబు. ఇంతకంటె వీడిగురించి ఎనలైజ్ చేయటం పిరాదండుగ అనవ సరం, నెక్స్ట్ అండ్ సెకండ్‌ఫూల్. కాంచన గంగారావు. వాడు ఇంటరు చదివాడు. (పాసయ్యేనని చెబుతాడు) అదర్స్‌కాస్ట్ మీద బ్రతికేయటం అంటే వాడికి నల్లేరు మీద బండి నడిచినట్టే. వాళ్ళనాన్న వడ్డీ వ్యాపారాలు చేస్తూ నానా గడ్డితిని వీడి కోసం సంపాదించి పెట్టేడు. సంపాదిస్తు న్నాడు. వాడి నాన్నకు వీడు మూడో పెళ్లాం కొడుకు. ఒక్కగా నొక్కడు. మొదటి యిద్దరి పెళ్ళాల్నీ సుఖపెట్టలేక పోతే వాళ్ళిద్దరూ తలోకణ్ణీ తగులుకుని ఝూంమ్మని లేచిపోయారు. మూడోది సుఖాల్తో విసుగెత్తి మూడో పెళ్లాంగావచ్చి వీణ్ణి కనేసి తనకర్తవ్యం అయిపోయినట్టు ఓరోజు ఝామ్మని చచ్చూరుకుంది. వీణ్ణి

వాళ్ళ నాన్న ఒకళ్ళమీద బ్రతకటం చిన్నప్పట్నుంచీ నేర్పి దేశంమీదకు వదిలేసాడు. వెధవ రోజుకు పెట్టెన్నర సిగరెట్లు తగిలేస్తాడు. అయితే ఒకటీ కొనడు. పొద్దున్న టిఫినూ సాయంత్రం టిఫినూ కూడా ఇంకోళ్ళ ఖర్చుతోనే మింగుతూంటాడు. కొత్తగా తాగడం నేర్చుకునే వాళ్ళకీ తాగినట్టు తెలిస్తే యింట్లో యెవుకలేరెస్తా రనుకునే వాళ్ళకీ వీడు గురువు. వీడిగొంతు తడిపి మరీ వాళ్ల కక్కుర్తిపడతారు. యెప్పుడూ బారులంట తనను పోషించే వాళ్లను వెంటేసుకుని తిరుగుతాడు. దొంగసారా వర్తకుల సంఘానికి వీడు ప్రెసిడెంటు 'వేట్' దొరికినా 'నాటు' దొరికినా తాగుతాడు. ఆ భేదం లేదు. అయితే తన స్వంతఖర్చుమీద మాత్రంకాదు. యీ విశాల ప్రపంచంలో ఒకడిగా బ్రతికేస్తున్నాడు మొత్తంమీద బద్మాష్!?

తర్వాత లలాటశాస్త్రి - దేశం ఖర్మం కాలి వాడు 'లా' చదివుంటే అధర్మం నాలుక్కాళ్ళమీద నడిచేది - వాడికింట్లో పొట్టపగిలేలా తిండిపెట్టే తల్లుంది - సత్తెకాలంది. కొడుకుచేత తలకొరివి పెట్టించుకుందుకు సిద్దగావున్న తండ్రున్నాడు. అభాగ్యుడు. వీడు తెచ్చే తగువులన్నీ తీర్చడానికి మెరికలాటి మేనమామ వున్నాడు. వస్తాదు తిండిపోతు - లలాట శాస్త్రిది, నోరుకాదు. దాన్నేం వనాలో - అంటారో నాకూ తెలీదు. ఆ నోటంట ఒక్క మంచి మాట రాదు. ఎప్పుడూ ఏ యిద్దరికి 'లంకె' పెడదామా అన్నదే వాడి ఆలోచన. అడుగు పెట్టినచోట పిడుగు పడుతుంది. నోరు విప్పినచోట ఘోరాలు జరుగుతాయ్. మాట్లాడేదంటే పోట్లాటకు సిద్ధమవాలన్న మాట - ఉలిపి జన్మ - చిలిపి జన్మాను వాడిది. వాణ్ణి చాలామంది లలాట శాస్త్రికి బదులుగా పితలాటశాస్త్రి అంటారు. అంద



రికీ తలలో నాల్కలా ఉన్నట్టుండాలనే వాడి తాపత్రయం-పక్కనే పుచ్చపాదు-పట్టి రాస్కెల్ వాడు వాడి అమ్మకీ-నాన్నకీ కయ్యం పెట్టాడు అమ్మకీ - మేనమావకీ మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమ నేలా చేసాడు. నాన్నకీ - మేనమావకీ పడ కుండా చేశాడు. అసలు వాడికీ వాడి ఆలో చనలకి పడదు. వాణ్ణి భజనచేసేవాళ్ళను నలుగుర్ని తన వెంట తిప్పుకుంటాడు. అందులో ఒకళ్ళతో ఒకళ్ళకు భస్తే సామ్యం ఉండనీడు. ఎవరికివారే హై స్థాయిలో వీణ్ణి భజన చేయాలనుకునే టట్టు తయారు చేస్తాడు - కుంటి పెళ్లానికి సొట్ట మొగుడులాటి బాపతు, వాడి భాష లోనే 'నేను పరమ వెధవని. వెధవన్నర వెధవని - వెధవన్నర వెధవా స్క్వేర్‌ను' వాడి నిత్యస్లోగన్' అది. నేను కాదనను-వాణ్ణి తెల్సినవాళ్లెవరూ కాదన్లేరు. 'గాడె లోన్ కెన్ సేవ్ హిమ్.

పోతే సూరిగాడు, వీడిలో మంచిగుణం ఒకటుంది. అది తను చెడిపోతున్నానని ఏడవక పోవటం. యెదుటివాడు ఏమాత్రం బాగుపడ్డా ఘొల్లు మంటాడు, వాడికి రంభ లాటి పెళ్లాం వున్నా పక్కవాడి 'కొక్కొరాయి'లాటి పెళ్లాన్ని చూస్తే వాడికి జెలసీ. వాడు మల్లెపువ్వులాటి బట్ట లేసుకున్నా పక్కవాడు కొత్త యిస్త్రీబట్ట తొడిగితే వాడి క్కావల్సినంత మంట. వాడి అంద మైన పెళ్లం అందమైన చీర కట్టుకుని అందంగా తయారైతే వాడికి 'ఎలర్జీ' - దేశంలో ప్రతి చేతగాని వెధవ రాజ్యాలేలే స్తున్నాడనీ పీఠాలలంకరించేస్తున్నాడనీ వాడి బాధ' పెళ్లాం ద్వారా సంక్రమించిన ఆస్థి రెండు లకారాలుంది. వాడి స్వంతది. పాతది అయినా ముప్పయి వేలుచేసే యిల్లుంది. బాంకులో వడ్డీలు తెచ్చే డబ్బుంది. వాడికిలేనిదల్లా తృప్తి యీ ప్రపంచంలో వున్నదంతా వాడి పేరున రాయించేసుకోవాలన్నంత 'ఆశ' వుంది. నో ఎక్స్పెక్యూజ్. ఆ రాస్కెల్‌ని డబల్ బారెల్ గన్నును గుండెలమీద పెట్టి కాల్చే సినా తప్పులేదు. 'తృప్తిలేని పశువూ ఓ మనిషేనా?'

యిక మిగిలిందల్లా మార్తాండ మూర్తి. వీడికి దేశభక్తి యెక్కువ. పరమ దేశ భక్తుడికి అల్లుడు. వీడి మామ లక్షాధికారి. దేశంకోసం అన్నీ త్యజించడానికి సిద్ధ పడిన వ్యక్తి ఆయన. యెన్నో ప్రజోప యోగ కరమైన పనులు చేశాడు. అందుకు తన ఆస్థిని విరజిమ్మాడు. పూర్తిగా తన యావదాస్థినీ దేశానికి రాసిచ్చేద్దాం అను కుంటూండగానే యీ మార్తాండ మూర్తి ఆయన కూతురుమెళ్లో ఓ తాళి కట్టి పారే శాడు. మామగారు బ్రతికుంటే దేశాని కెక్కువ సేవ చేసేటట్టున్నాడని మామ గార్ని చంపి పారేయించాడు. ఆయన చేయదల్చుకున్న పనులను నేను పూర్తిచేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరుస్తానని ప్రెస్ స్టేట్‌మెంట్స్ యిచ్చాడు. దాంతో వీడి ఇన్‌ఫ్లుయెన్స్ తారాపథాని కందు కుంది. పాతిక లక్షల ఆస్థిని మామగారు ఏడు లక్షల వరకూ కరిగించేసరికి అల్లు డుగా వచ్చి మామను పరలోక యాత్ర పంపిన మూడేళ్లలో నలభై లక్షల ఆస్తిని సంపాదించాడు. దొంగ నోట్లు, స్మగ్లింగ్ అవి పొక్కకుండా పార్టీలకు విరాళాలు

ఓహ్, డబ్బు రాజ్యం ఏల్తున్న దేశం యీనాడు మనది. వెధవపనులు చేసేవాళ్లందరికీ, చేయగల దమ్మున్నవాళ్లందరికీ 'పుష్పక విమానం'లో చోటుంటుంది.

ఎక్కడో భూగర్భంలోవున్న జల సంపదకోసం ప్రజల సంపదను కొల్లగొట్టటం కాదు నాయనా కావల్సింది.

క్రిందివాడు రా యెత్తుతేనే పెద్దవాడు నివసించడానికో భవంతి లేస్తుందన్న నిజం మర్చిపోతే యీ జాతికి మనుగడ ఉందా ?'

ఊరికే తలుపులు దబ దబ బాదుతున్నారు. తలుపు తీసాను. ఐదుగురూ ఒక్కుమ్మడిగా నామీద కొచ్చి పడ్డారు.

'ఒరే కవి, నువ్వు కుక్కవీ, నక్కవీ కనుక మా మీద ఓ కథ రాసి పారెయ్. ఏమిటి?' శవలింగం జోగుతూ నా భుజం మీద ఓ చెయ్యి ఆన్చి నా ముఖంలో ముఖం పెట్టి అడిగాడు.

నేను మాట్లాడలేదు

'రాయ్రా - అచ్చయితే నీకు సన్మానం చేయించే బాధ్యత నాది' మార్తాండమూర్తి అన్నాడు.

'ఇంతకీ మమ్మల్నెందుకు పిలిచి మరీ పార్టీ యిచ్చావ్' కాంచనగంగారావు.

'ఛస్తాడా! వాడికథకో ప్లాటు కావల్సినప్పుడల్లా మనకి పార్టీ యిస్తూ ఉన్నాడు' లలాట శాస్త్రి.

'సరే రాసుకో - మా కథే రాసుకోరా ఫూల్. టా టా' తూలుకుంటూ మార్తాండ మూర్తి వెళ్తుంటే గొర్రెల మందలా అనుసరించారు మిగతా నలుగురూ.

'మా కథే రా సు కో రా ఫూల్' మార్తాండ మూర్తి మాటలు నా చెవుల్లో మారుమ్రోగాయ్.

నిజమే నేను ఫూల్ నే - ఒఠి ఫూల్ ను కాదు. ఐయామ్ ఫూల్ ఆఫ్ ఫూల్స్' కాగితాలూ కలం తీసుకున్నా కథ వ్రాయటానికి.

★

---

ప్రముఖ స్పానిష్ చిత్రకారుడు (P. R. Picasso) పికాసో, ఒకసారి తన గదిలో పెద్దసైజులో మరియు ప్రత్యేక ఆకారం కలిగిన Wardrobe కావలసియుండి స్థానిక వడ్రంగి వద్దకువెళ్ళి తనకు కావలసిన సైజు, ఆకారం గురించి అరగంట సేపు చెప్పినా ఆ వడ్రంగికి అర్థం కాలేదట. చివరకు విసుగుతో, దగ్గరలోయున్న కాగితపు ముక్కను తీసుకొని, తనకు కావలసిన Wardrobe ఆకారం, సైజులతో బొమ్మగీసి, 'సరిగ్గా నాకు ఇటువంటిదే కావాలి, ఖరీదెంతవుతుంది' అని అడిగాడట. దానికి ఆ షాపు యజమాని, ఖరీదు అక్కర్లేదు మీరు గీసిన ఆ బొమ్మక్రింద మీ సంతకం చేయండి చాలు అన్నాడట.

సేకరణ: జి. అశోక్ రెడ్డి.